

బి. ఎ. ముగించి ఇంట్లో కూర్చున్న రాధ ప్రతి రోజు ఉదయమే పేపరు చూడడము, ఉద్యోగాలకి దరఖాస్తులు పెట్టడము చేస్తూంది. రకరకాల ఉద్యోగాలకి దరఖాస్తు చేసింది! ఆ ఉద్యోగం తనకి రావాలని, తాను చేయాలి అన్న ధ్యాస లేదు రాధకి! ఇంటర్వ్యూకి వెళ్లి ఏం చెయ్యాలో, ఏమడుగు తారో అన్న ఉత్కంఠ మా రాధమ్మని—సారీ! వింటే అరుస్తుంది — రాధని ఉద్యోగాలకి అప్లికేషను

*డబ్బు సంపాదనకొరకు వచ్చే ఇంటర్వ్యూలు చేదుగా ఉంటాయి. భయపెడతాయి. ఒకే ఒక ఇంటర్వ్యూ తియ్యగా, మధురంగా ఉంటుంది. దానికి భయం బదులు, సిగ్గు ముంచుకు వస్తుంది. ఆడపిల్లకు, పెళ్ళి చూపులు మించిన ఇంటర్వ్యూ మరేం వుంటుంది!*

---

వెయ్యమని ప్రోత్సహించిందిట!

స్త్రైపుమిషను గొడవ తెలియదు కాబట్టి స్త్రైపిస్టు ఉద్యోగాల జోలికి పోలేదు. టీచర్ కావాలి అన్న చోటల్లా గబగబా దరఖాస్తులు వ్రాసి పడేసింది. సేల్స్ గరల్ కావాలంటే, సిద్ధం అంది. వంటావిడ కావాలని వేస్తేకూడా రాధ దరఖాస్తు పెట్టింది. అవ్వ! వంట చేస్తే రుచి చూడడంకూడా రాదు రాధకి! అలాంటిది తనలాగ బ్రహ్మాండం బ్రద్దలయ్యే లాగ ఎవ్వరూ వంట చెయ్యలేరని వ్రాసింది గొప్పగా.

ఏం రాసి, ఏం చేస్తే ఏం? ఒక్కళ్ళూ ఇంటర్వ్యూకి రమ్మన్న పాపాన పోలేదు. ప్చ్! ఇంటర్వ్యూ, ఇంటర్వ్యూ అంటూ కలల్లో తేలుతూ కూర్చుంది రాధ! 'బి. ఎ. పాసయినా, ఏ ఉద్యోగం రావడంలేదే!' అని కొంత బాధపడింది మా రాధ!

గడుసుపాలు, చిలిపిపాలు ఎక్కువైన రాధ 'ఆఖరికి వంటామె ఉద్యోగం వచ్చినా బాగుండును! వదినని కూడా తీసుకువెళ్ళి, అల్లరిచేసి రావచ్చును' అనుకుంది. కాని, పాపం! ఇంకా భగవంతుడికి దయ కలగలేదు! పుండుమీద కారం చల్లినట్లు అన్నయ్య వేళాకోళాలు. "రాధా! ఇంటర్వ్యూ వచ్చిందే!" అరుస్తు న్నయ్య. పెద్ద ఉద్యోగం వెలగబెట్టబోతున్నట్లు, రాజాలాగా అంగలు వేసుకుంటూవచ్చి, ఎదురుగుండా అన్నయ్య, వదినలు పగలబడి నవ్వడం చూసి, అంతా నాటకం అని తెలుసుకుని "ఛీ ఫీ!" అంటూ ఏడుపు ముంచుకురాగా తిరిగి వెళ్ళిపోతుంది.

"పోస్ట్! రాధమ్మగారికండీ!" అన్న పోస్ట్‌తాత కేక వినగానే చెంగుచెంగుమని గెంతుతూ వచ్చింది. కవరు విప్పి చదివిన రాధకి పట్టపగ్గాలు తెలియటం లేదు. ముఖం నిండా ఆనందాన్ని పులుముకుని, "అన్నయ్యా! చూసుకో!" అంటూ ఇంటర్వ్యూకి రమ్మన్న ఉత్తరం అన్నయ్యమీదికి విసిరింది! కలా? నిజమా? అన్న అనుమానం కలిగి, "వదినా!" అని పిలిచి, ఆమె, "ఓ . . ." అంటే, కలకాదు, నిజమే అని నిశ్చయించుకుంది.

సంతోషంతో ఉక్కిరి బిక్కిరి అయి ఇల్లంతా తిరుగుతూంది రాధ! "లలలా లలలా!" అంటూ ఇల్లెగిరిపోయేలా పాట పాడుతూంది.

విమానాశ్రయంలో పని! అసలక్కడికి తను దరఖాస్తు చేసిన గుర్తే లేదు రాధకి! ఏమో వెయ్యంట ఒకటి! ఎక్కడ గుర్తు తనకి!

ఎల్లుండే ఇంటర్వ్యూ!

---

## ఆకొండ గౌరీదేవి

---

కలలు కన్న రోజు ఎదురుగుండా నిల్చుంది!

ఇంటర్వ్యూకి ఏం డ్రస్సు అన్న దానిలో మొదలైంది సమస్య! సాల్వారు, కమీజా? చీరా, జాకెట్టా?

"సరే . . . చీర!" అని నిశ్చయించుకున్నారు. మరి ఏ చీర?

పచ్చనిదా? ఎర్రనిదా? నీలమా? పసుపా?

నూలా? పట్టా? సిల్కా? నైలానా?

అబ్బ! హడావిడిలో బుర్ర పనిచెయ్యడం ఆగిపోతుంది తక్కువ.

పట్టుచీరలో పెద్ద పేరక్కలా ఉంటానంది!!

నైలాన్ చీరలో మరీ చిన్నపిల్లలా ఉంటానంది!

సరే, నూలుచీర కడతానంది!

ఏం రంగు? నీలంరంగుది ఎన్నిక చేసింది!

అన్నయ్య ఈ తాపత్రయం చూసి, ఒక్కటే హేళన!

"అందుకనే ఆడవాళ్ళు ఉద్యోగాలు చెయ్యకూడదు. రోజూ ఏం చీర? ఏం జాకెట్టు? ఏం రంగు? ఏం పూవులు? అని తర్జనభర్జనలు చేసి పదింటికి ఆఫీసైతే పదిన్నరకి వస్తారు. ఏమైనా అంటే నీళ్ళకుండ చిల్లు — ఏడుపు!"

"చాల్లేవోయ్! పెద్ద! నువ్వో—నువ్వేం చేస్తావు? వదులా? బిగువా? వైట్ షర్టా, కలర్ షర్టా, బుష్ షర్టా, ఫుల్‌హాండ్సా, హాఫ్ హాండ్సా అని వదినని సలహా అడగడం నాకు తెలీదనుకోకు! ఏం అంతలా తీసి పారేస్తావు ఆడవాళ్ళని?"

అన్నయ్యకి సరియైన ఉజ్జీ అనిపించుకుంది రాధ.

"తందాన తానా . . ." తాళం వేసింది వదిన.

ఇంకా ఊరుకోలేదు అన్నయ్య.

"అంతేనా?. . . వాళ్ళ సిగలసింగారం చూడాలి."

రాధ, "ఆ. . . బాగా జ్ఞాపకం చేశావు. వదినా! మరిచిపోయా! ఏం ముడి వేసుకోవాలి?" టక్కున అడిగింది వదినని.

"నేను చెప్పనా రాధమ్మా!" కొంటెగా అడిగాడు అన్నయ్య.

"వద్దమ్మా, అన్నయ్యమ్మా!" బుంగమూతితో అంది.

"నే చెబుతా, విను. మహాబలిపురం సిగ వెయ్యి. లేదా అజంతా సిగ చుట్టు. బర్మా సిగ, జపాను సిగ, ఫ్రెంచ్ సిగ, హాండిల్ సిగ, ఫ్లవర్ సిగ, బన్ సిగ, రొట్టె సిగ . . . ఇంకా, ఇంకా . . . గుర్రం తోక, గాడిద తోక, మేక తోక, కుక్కతోక . . ." అన్నయ్యకే నవ్వాగలేదు!

రాధ, వదిన బలవంతాన నవ్వు ఆపుకోడానికి తెగ ప్రయత్నిస్తున్నారు.

"నీ తోక, నా తోక—ఇంకా ఏం తోక వేసుకోవాలో చెప్పు. ఎం చక్కా వేసుకుంటా!" కోపంగా అంది రాధ.

"ఇంక లేడీస్ డిపార్ట్‌మెంట్ వదిలి వెలుదురూ నీ కడుపున పుడతాను!" వదిన అన్నయ్యని బ్రతిమా లింది.

"నువ్వు నా కడుపున పుట్టక్కర్లేదు!" అన్నయ్య అన్నాడు స్వరం తగ్గించి.

"ఎవరో నీ కడుపున పుట్టబోతున్నారుగా?". . . . అంది రాధ వదినని ఊరిస్తూ.

వదిన బాగా సిగ్గుపడిపోయింది.

అన్నయ్య ఓరకంట వదినని చూడసాగాడు.



నిగనిగలాడే నల్లని కురుల రహస్యం...

కేశవర్ధిని

కేశవర్ధినిని నిత్యం వాడండి. అది మీ శిరోజాలను చక్కగా పెంపొందిస్తుంది




* హజరుగా వాడటానికి కేశవర్ధిని రెడీమిక్స్‌డ్ హెయిర్ ఆయిల్

* శిరోజాలను శుభ్రంగా, సువాసనగా ఉంచేందుకు కేశవర్ధిని షాంపూ.

తయారు చేయువారు:

**Kesavardhini Products,**
**MADRAS-14.**

GPK-1



దేవీపూజ    చిత్రం—మారేమండ శ్రీనివాసరావు (గుంటూరు-2)

"రాధా! రాధా!" పక్కింటి అమ్మాయి పిలుస్తోంది. ఆ అమ్మాయి పేరుకూడా రాధే!

"ఏమిటే హడావిడిగా ఉన్నట్టున్నారే!" అంది పక్కింటి రాధ పరిశీలనగా చూస్తూ.

"ఆఁ—ఆఁ— ఏం లేదు. ఏమీ లేదే!" నీళ్లు నమిలారు రాధ, వదిన ఏం తెలిసిపోతుందోనని భయపడుతూ.

అన్నయ్య వాళ్లని చూసి నవ్వుకున్నాడు.

"రాధా! ఒకటే అడగాలని వచ్చాను. నీకు విమానాశ్రయంలో ఉద్యోగానికి ఏదేనా ఇంటర్వ్యూ వచ్చిందా?. . ." అడిగింది పక్కింటి రాధ.

"ఆఁ — ఆఁ —" పచ్చివెలక్కాయ పడింది రాధ గొంతులో. చెప్పగూడదనుకుంటూనే, "నీ కెలా తెలుసు?" అనేసింది రాధ.

వదిన, అన్నయ్య విస్తుపోయి చూస్తున్నారు. నవ్వింది పక్కింటి రాధ. "అది నాకు రావలిసింది."

"ఆఁ. . ." నోరు తెరిచారు రాధ, వదిన.

అన్నయ్య ఆశ్చర్యంలోనించి తేరుకుంటూ, గొంతు సర్దుకున్నాడు. "ఎలాగమ్మా?. . ." మెల్లిగా అడిగాడు.

"మీకు వచ్చిన కవరుమీద అడ్రసు చూడండి" అంది.

ఆ కవరుమీద చూస్తే, ఎస్. రాధ!

మై గాడ్! తన పేరు ఎస్. రాధ!

ఖంగారులో అడ్రసుకూడా గమనించలేదు. 'ఎంత ఫూల్‌నయ్యాను' అనుకుంది రాధ!

"మేం కొత్తగా ఈ ఇంటికి వచ్చాం. కాబట్టి అలవాటుగా వచ్చే పోస్ట్‌మాన్, రాధంటే నువ్వే అని, అలవాటుగా అడ్రసు సరిగా చూడక నీకు ఇచ్చేశాడు. ఏ సంగతీ కనుక్కుందామని, వాళ్లాఫీసుకి వెళితే ఇంటర్వ్యూకి రమ్మని లెటర్ వ్రాశామే అన్నారు. సరే, ఒకవేళ ఇలా జరిగిందేమోనని నీ దగ్గిరికి వచ్చాను. చాలా థాంక్సు, రాధా" అంటూ కవరు లాక్కుని వెళ్లిపోయింది, మధ్యలో వచ్చిన రాధ.

ఆశగా ఆరగిద్దామన్న ఆహారాన్ని గద్ద తన్నుకుపోగా, నిరాశతో నిల్చున్న పక్షిలా ఉంది రాధ.

ఏడ్పు ముంచుకు వస్తోంది రాధకి!

వదినపక్కకి చేరింది!

అన్నయ్య మెల్లిగా చెప్పాడు: "అంతా భగవదిచ్ఛ!" అని వేదాంతధోరణిలో అన్నాడు నవ్వుతూ.

రాధ "ఊఁ. . .!" గునిసింది గోముగా.

అన్నయ్య ఏదో జ్ఞాపకం వచ్చినవాడిలా "అన్నట్టు, మరిచేపోయా, రాధా! నిజంగా నీకు రేపు ఇంటర్వ్యూ ఉందే!" భార్యవైపు కన్ను కొట్టాడు.

రాధకి సగం ఏడుపు, సగం నవ్వు ముంచుకు వచ్చాయి.

"ఇద్దరూ కలిసి ఏడ్పిస్తున్నారా నన్ను?"

ఉక్రోషం వచ్చింది రాధకి.

"కాదు, నిజంగానే!" ముసిముసిగ నవ్వింది వదిన.

"రేపు పెళ్లివారు వస్తున్నారు. అక్కడ నీకు ముఖ్యమైన ఇంటర్వ్యూ!"

అంత ఏడ్పు ఏమయిందో రాధకి!

సిగ్గుల పెళ్లికూతురైంది, ఇంటర్వ్యూలో చూడబోయే మన్మథుణ్ణి ఊహించుకుంటూ!

"ఊఁ. . .!" తడబడింది రాధ.

"మరీ సిగ్గుపడితే ఇంటర్వ్యూ ఎలా చేస్తావే!" వదిన వేళాకోళం చేసింది.

"రాధా!" మెల్లిగా అన్నాడు అన్నయ్య. "వదిన దగ్గిర రేపటి ఇంటర్వ్యూలో ఏం చెయ్యాలో, ఏం చెప్పాలో బాగా నేర్చుకో. దాని కన్ని తెలుసు. మనల్ని అందరిని ఇట్టే వలలో వేసుకుంది కదూ!" భార్యవైపు కొంటెగా చూశాడు.

వదినకి సిగ్గు, కోపం ముంచుకురాగా మూతి మూడు వంకరలు తిప్పింది.

రాధ నవ్వుతూ తుర్రుమంది లోపలికి, ఇంటర్వ్యూని గురించి కలలు కనడానికి!

రాధ కోరిక ఫలించింది!

రాధకి ఇంటర్వ్యూ జరిగింది!

తన ఇంటర్వ్యూ కలలా అందంగా ఆనందంగా జరిగిందని, అందరికీ అలాంటి ఇంటర్వ్యూలు వస్తేనే బాగుంటుందని ఇప్పటికీ అంటుంది. ఇంటర్వ్యూ నూటికి నూరు పాళ్లు సక్సెస్!

పర్మనెంటుగా అప్పాయింటయింది.

ఎక్కడ?

భర్త హృదయంలో!

ఎంత గడుగ్గాయి చూడండి!

పైగా, తన హృదయంలో భర్తని పర్మనెంటుగా అప్పాయింటు చేసుకుంది. 'ఇంటర్వ్యూ'లో ఘటికురాలు మా రాధ!

★